ఉపాధి కూలీల బిల్లులు విడుదల చేయాలి

బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య

చేవెళ్లటౌన్, మే 13: ఉపాధి కూలీల బిల్లులు వెంటనే విడుదల చేయాలని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ మహాసభ సమావేశం చేవెళ్లలోని అంబేద్కర్ భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలైన తాగునీరు, టెంటు, వైద్య కిట్టు, రవాణా సౌకర్యం, పార, గడ్డపారలు వంటి సౌకర్యాలు లేకుండా పనులు చేయిస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన వేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలు పనులు చేస్తుంటే కనీస వేతనం కూడా రావడంలేదని ఆరోపించారు. ఐదు వారాల నుంచి ఉపాధి కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, మరి ఏమి తిని పనిచేయాలో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధి పథకం జోలికి వస్తే ఊరుకునేదిలేదని మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మహిళా సంఘం జిల్లా వర్కింగ్ పైసిడెంట్ వడ్ల మంజుల, ఇన్సాప్ జిల్లా అధ్యక్షుడు మక్బూల్, బీకేఎంయూ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఆరుట్లలో బడిబాట కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఆరుట్లలో జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మంచాల, మే 13: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఎంతో మంది నేడు ఉన్నత స్థానంలో రాణిస్తున్నారని, అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. మంగళవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆరుట్ల పాఠశాలను రాష్ట్రంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను ఆధునీకరించడంతోపాటు విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించడానికి ఆయన కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలని ప్రైవేటు పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బోధన చేసేందుకు సరిపడా సిబ్బందిని నియమించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రంగారెడ్డి జిల్లాలోనే ఏ పాఠశాలకు రాని అవకాశం ఆరుట్ల జిల్లా పాఠశాలకు వచ్చిందని, అందుకే ప్రభుత్వం కోట్లాది రూపాయలతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టిందని, అందుకే పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత కూడా గ్రామస్తులపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, ఎంపీడీవో బాలశంకర్, మండల విద్యాధికారి రామ్‌దాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సలాం, విద్యా కమిటీ సభ్యుడు కంబాలపల్లి భాస్కర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్‌తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు తగ్గించాలి..భూసారాన్ని పరిరక్షించాలి

శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రగతికుమారి, డాక్టర్ రవీందర్

తోలుకట్టాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మొయినాబాద్, మే13: పంట సాగుకు ముందే భూసార పరీక్షలు చేయించుని భూసారం ఆధారంగా ఎరువులు వాడితే భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రగతికుమారి, డాక్టర్ రవీందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలో రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే శీర్షికతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకుంటే పంటల దిగుబడిని ఎక్కువగా ఆశించవచ్చని తెలిపారు. పంటలు అధిక దిగుబడులు సాధించాలనే ఆలోచనతో ఇష్టానుసారంగా ఎక్కువ ఎరువులు వేస్తుంటారని, అలా వేయడం వలన పంటలు దిగుబడులు అధికంగా రావని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు తీసేలా రైతులు అవగాహన పొందాలని చెప్పారు. రైతులు ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన భూమిలో ఉన్న భూసారం తగ్గుతుందని, పంటల మార్పిడి తప్పనిసరిగా వేయాలన్నారు. రైతులకు అధిక దిగుబడులు రావాలంటే అంతర్ పంటలు కూడా సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, వృత్తిక శాస్త్రవేత్తలు ఎస్ఆర్ఎఫ్ వినయ్, పీహెచ్‌డీ స్కాలర్ వందన, ఏఈవో కుమార్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు తొలగింపు

బొంరాస్‌పేట్, మే 13: 'గాలివాన బీభత్సం' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈనెల 12వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడటంతో స్తంభం విరిగిపోయింది. మంగళవారం విద్యుత్ అధికారులు అక్కడ కొత్తగా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయడంతోపాటు రహదారి పై పడిన మర్రిచెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మర్రి చెట్టును తొలగించడంతో తండ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డుకు అడ్డుగా పడిన చెట్టు కొమ్మలను తొలగించిన అధికారులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మాల్ సంతను పరిశీలిస్తున్న అధికారులు

మాల్ పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్లు రవీందర్, వెస్లీ

మాల్ గ్రామంలో సంత, పల్లె పకృతివనం పరిశీలన

యాచారం, మే13: ప్రజా సమస్యలపై అధికారులు ప్రధాన దృష్టి సారించాలని గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్లు రవీందర్, వెస్లీ ఆదేశించారు. మండలంలోని మాల్‌లో ఆయన పంచాయతీ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. మాల్‌లో కొనసాగుతున్న పశువుల సంతను పరిశీలించారు. సంతలో నెలకొన్న సమస్యపై ఆరా తీశారు. సంతకు సొంత స్థలం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. సంతలో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పల్లె పకృతి వనాన్ని సైతం పరిశీలించారు. పకృతి వనంలోని మొక్కలను స్వయంగా పరిశీలించి మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మాల్ గ్రామానికి తెలంగాణలోనే ఉత్తమ జాతీయ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మాల్ అభివృద్ధికి కృషి చేసిన పంచాయతి అధికారులు, సిబ్బందిని వారు అభినందించారు. ఉత్తమ పంచాయతీ కింద కేంద్ర ప్రభుత్వం అందించే రూ.కోటి నగదు పారితోషికంతో మాల్ గ్రామపంచాయతీని మరింతగా అభివృద్ధి చేసుకోవాలని వారు అధికారులకు సూచించారు. సంతకు సొంత స్థలంతో పాటుగా తాగునీరు, నీడ, పార్కింగ్ తదితర వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలో తాగునీరు, మంచినీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. వాణిజ్య రంగంలో మాల్ పట్టణాన్ని మరింతగా తీర్చి దిద్దాలని వారు అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి అధికారి సురేశ్‌మోహన్, డీఎల్‌పీఓ సాధన, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు ఉన్నారు.

సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి సురేశ్‌కుమార్

యాచారం, మే13:ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి రైతువేదిక భవనంలో రైతు సంక్షేమ కమిటీ అధ్యర్యంలో రైతులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలో కూరగాయ ఉత్పత్తిని పెంపొందించేందుకు చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉద్యాన పంటలను అభివృద్ధి చెందేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. దీనికోసం ప్రభుత్వం సబ్సిడీ కింద డ్రిప్పు, స్ప్రింక్లర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీ కింద రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహ్మారావు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రిజిష్టర్ ప్రక్రియ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింకు ఉన్న ఫోన్ నంబర్‌ను వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలని, లేదంటే మీ-సేవలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఉద్యానశాఖ అధికారి నవీన మాట్లాడుతూ.. మండలంలో రైతు సంక్షేమ కమిటీ ఏర్పాటు చేసిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం చేసేలా రైతులు కృషి చేయాలన్నారు. అధికారుల సలహాలు, సూచనలతో ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేసి ఆదర్శంగా నిలిచేందుకు కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవినాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు ఉన్నారు.

వికలాంగులకు అంత్యోదయ కార్డులివ్వాలి

దోమ, మే 13 : రాష్ట్రంలో వికలాంగుల సమాజం అనేక సమస్యలతో అల్లాడి పోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగుల సమస్యలను పరిష్కరించకుండా ఉద్యమాలను అణిచివేసే కుట్రలు చేయడం విడ్డూరంగా ఉందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్, దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య అన్నారు. మంగళవారం వికలాంగుల సంఘం సభ్యులు దోమ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తమకు అంత్యోదయ కార్డులు అందజేసి సన్న బియ్యం పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెబుకుంటున్న సీఎం దుర్భర జీవితాలు గడుపుతున్న వికలాంగులకు అంత్యోదయ కార్డులు ఇచ్చేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో వికలాంగ సమాజానికి సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల హామీ మేరకు వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచడంతోపాటుగా ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్, మండల అధ్యక్షుడు చుక్కయ్య, సంఘం నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దోమలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుకు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల సంఘం సభ్యులు

విద్యుత్ కోతలు.. ప్రజలు బేజార్

- భగ్గుమంటున్న ఎండలు..
- అమలుకాని నిరంతర విద్యుత్
- వెలవెలబోయిన చిరు వ్యాపారాలు

విద్యుత్ కోతలతో ఖాళీగా ఉన్న ఓ జ్యూస్ సెంటర్

షాద్‌నగర్ రూరల్, మే 13: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసవికాలంలో సైతం 24 గంటల విద్యుత్ సరఫరాను అందించింది. దాంతో నాడు వ్యాపారస్తులకు, ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. విద్యుత్ సమస్య ప్రజలకు తలనొప్పిగా మారింది. విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి షాద్‌నగర్ పట్టణంలో దాపురించింది. సమయాపాలన, ముందస్తు సమాచారం లేకుండా అప్రకటిత విద్యుత్ కోతలతో వ్యాపారస్తులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం దీనికి తోడు విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కపోతను భరించలేకపోతున్నారు. బయటకు వెళ్దామంటే భానుడి భగ..భగ ఇంట్లో సేదతీరుదామంటే విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. పట్టణంలోని అప్రకటిత విద్యుత్ కోతలతో తమ వ్యాపారాలు అంతంత మాత్రమే నడుస్తున్నాయని, కిరాయి కట్టలేని దుస్థితి నెలకొన్నదన్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల గోస దేవుడికే ఎరుక అనే విధంగా మారింది. విద్యుత్ వచ్చిపోతుండటంతో మోటర్లు కాలిపోయి రైతన్నలు అవస్థలు పడుతున్నారు. మోటర్లను రిపేరింగ్ చేయించేందుకు పట్టణంలోని మోటర్ దుకాణాల వద్దకు రైతులు క్యూకడుతున్నారు. ఏది ఏమైనా అప్రకటిత విద్యుత్ కోతలతో వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమస్య తలెత్తకుండా చూస్తాం..

విద్యుత్ సమస్య లేకుండా చూస్తాం. సాధ్యమైనంత వరకు నిరంతరం విద్యుత్ అందించేలా చూస్తున్నాం. షాద్‌నగర్ సబ్‌స్టేషన్‌లో సరిపడా ఉద్యోగులు లేరు. ప్రైవేట్ వ్యక్తులతో పనులు కొనసాగుస్తున్నాం. – వినోద్,
విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ, షాద్‌నగర్

ఇబ్బందులు పడుతున్నాం..

డీటీపీ, ఆన్‌లైన్ సెంటర్‌తో జీవనోపాధి పొందుతున్నా. ఇటీవల అప్రకటిత విద్యుత్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కస్టమర్లకు ఆన్‌లైన్ సర్వీస్ అందించలేకపోవడంతో తిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో కనీసం కిరాయి కట్టలేని పరిస్థితి ఏర్పడింది. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తే బాగుంటుంది.
– రమేశ్, ఆన్‌లైన్ సెంటర్ యాజమాని, షాద్‌నగర్

ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

ఉద్యమకారులు దేశమొల్ల ఆంజనేయులు, గడ్డం వెంకట్‌రెడ్డి

మొయినాబాద్, మే13:కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోనికి వచ్చిన తరువాత హామీని తుంగలో తొక్కడం చాలా బాధాకరమని తెలంగాణ ఉద్యమకారులు దేశమొల్ల ఆంజనేయులు, గడ్డం వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టారని చెప్పారు. అధికారంలోనికి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం ఉద్యమకారులను అవమానపర్చడమేనని పేర్కొన్నారు. స్థలం వస్తుందనే ఆశతో తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి అధికారంలోకి తీసుకువచ్చామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల స్థలాలు ఇవ్వకపోతే ఉద్యమకారుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపిస్తామని, మరో ఉద్యమానికి తెరలేపుతామని హెచ్చరించారు. సమావేశంలో ఉద్యమకారులు న్యాలట మహిపాల్, కర్రె సునీల్‌కుమార్, ఆకుల నవీన్‌కుమార్, డప్పు చంద్రయ్య, ముంజగల్ల మహేందర్, నరసింహులు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారులు దేశమొల్ల ఆంజనేయులు, గడ్డం వెంకట్‌రెడ్డి

ముద్దయిన నిల్వ ఉంచిన ఉల్లిగడ్డ

తీవ్రనష్టం.. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని రైతుల వేడుకోలు

మర్పల్లి, మే 13 : ఆరుగాలం పగలూ రాత్రి కష్టపడి పండించిన ఉల్లిగడ్డ పంట నిల్వ ఉంచిన వద్దనే పూర్తిగా ముద్దయింది.. పంచలింగాల్ గ్రామంలోని బందగి మొగులయ్య రెండెకరాలు, ఈడిగి ఆంజనేయులు గౌడ్ రెండెకరాల పొలంలో ఉల్లి పంట సాగు చేసి ఒక్క దగ్గర కుప్పగా పోశారు. మంగళవారం పోసి పెట్టిన కుప్ప గుంత పడటంతో ఓపెన్ చేసి చూడగా పూర్తిగా మురిగి పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము వేల రూపాయలు అప్పులు చేసి ఉల్లిగడ్డ పంట సాగు చేశామని, ఉల్లిగడ్డను మార్కెట్‌లో అమ్ముకొని తెచ్చిన అప్పులు తీర్చాలనుకుంటే మొత్తం పాడైందని, అప్పులు ఎలా తీర్చాలని అందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

అప్పు చేసి ఉల్లి పంట సాగు చేశాం..

మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి. అప్పు చేసి ఉల్లి పంట సాగు చేసి పంటను ఒక్క దగ్గర నిల్వకు కుప్పపోసి పెట్టాం. ధరలు ఎక్కువ రాగానే మార్కెట్‌కు తీసుకెళ్దామనుకున్నాం. ఇంతలోనే పూర్తిగా మురిగిపోయింది. కోల్ట్ సోరేజీ ఉంటే రైతులు అందులో నిల్వ చేసుకుని ధరలు పెరిగిన వెంటనే అమ్ముకుంటారు. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే మండల రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. – *బందగి మొగులయ్య, పంచలింగాల్, మర్పల్లి*

తల్లిదండ్రి లేని బాలికలు టెక్నికల్ డిప్లామా కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా సంక్షేమ అధికారి జయసుధ

వికారాబాద్, మే 13 : తల్లి, దండ్రి లేని బాలికలు, అనాధ బాలికలు టెక్నికల్ డిప్లామా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జయసుధ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ సంస్థ హైదరాబాద్‌లో మూడేండ్ల టెక్నికల్ డిప్లామా కోర్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2025-26 ఏడాదికి గాను తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, తల్లి/తండ్రిని కోల్పోయిన బాలికలు, అక్రమ రవాణాకు గురైన దివ్యాంగుల బాలికల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

కోర్సుల వివరాలు

సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ తదితర కోర్సులు ఉన్నాయన్నారు. ప్రతి కోర్సులో 60సీట్లు గాను, మొత్తం 240 సీట్లలో తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ బాలికలు, తండ్రిని కోల్పోయిన నిరుపేద బాలికలకు కేటాయించబడుతుందన్నారు. అంతే కాకుండా ఈ బాలికలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు. మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తామన్నారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతోపాటు వసతి కల్పిస్తామన్నారు. కులము (అనాథ బాలికలకు అవసరంలేదు), ఆదాయ ధ్రువీకరణ (అనాథ బాలికలకు అవసరంలేదు), మరణ ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్, దరఖాస్తు ఫారానికి సంబంధిత ధ్రువపత్రాలు జత చేసి మే 20వ తేదీలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు వికారాబాద్ జిల్లా ఎన్నెపల్లి చౌరస్తాలోని బాల రక్షభవన్(జిల్లా బాలల పరిరక్షణ విభాగం)ను సంప్రదించాలన్నారు. ఫోన్ నం:9640863896, 9849672296 సంప్రదించాలని సూచించారు.

హత్య కేసులో ముగ్గురి నిందితులకు జీవిత ఖైదు

జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి

వికారాబాద్, మే 13: హత్య కేసులో ముగ్గురి నిందితులకు జీవితఖైదు పడినట్లు కోర్టు తీర్పు వచ్చిందని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోట్‌పల్లి మండలం ఇందోల్ గ్రామానికి చెందిన బాసుపల్లి పెంటప్పా(ఫిర్యాదుదారుడు),తన తమ్ముడు బాసుపల్లి హన్మంతు(మృతుడు)కు తమ పాలోళ్లు బాసుపల్లి అంజిలప్ప కుటుంబంతో తరచూ ఘర్షణలు జరిగేవి. 2014 డిసెంబర్ 4వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో హన్మంతు తన ఇంటికి వెళ్లే క్రమంలో బాసుపల్లి అంజిలప్ప పాత గొడవలు మనసులో పెట్టుకొని ఘర్షణకు దిగాడు. ఆ సమయంలో అంజిలప్ప కుమారులు ఏ1- శ్రీనివాస్, ఏ2 -పాండు అక్కడికి వచ్చి హన్మంతు తలపై కట్టెతో, రాయితో దాడి చేయగా..అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ ఆర్. రమేశ్ కేసు నమోదు చేశారు. అప్పటి కరణ్‌కోట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శివశంకర్ దర్యాప్తు నిర్వహించారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి మంగళవారం నిందితులకు జీవిత ఖైదు, జరిమానా శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో న్యాయసేవ అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నారాయణ గౌడ్, వి.రవికుమార్, పి.సుధాకర్‌రెడ్డిలు, దర్యాప్తు నిర్వహించిన అప్పటి ఎస్సై ఆర్.రమేశ్, ఇన్‌స్పెక్టర్ కె.శివశంకర్, ప్రస్తుత ధారూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రఘు రాములు, ఎస్సై గఫ్ఫార్, సీడీపోలు మహేశ్వర్ రెడ్డి, బ్రీఫింగ్ అధికారి బి.వీరన్నలు సమష్టిగా కృషి చేశారన్నారు. ఈ కేసులో శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి అభినందించారు.

మైసమ్మతల్లి నుదుటిపై సూర్య కిరణాలు



కడ్తాల్, మే 13: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధిగాంచిన కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో మైసమ్మతల్లి విగ్రహాన్ని మంగళవారం సూర్య కిరణాలు తాకాయి. గతంలో ఎప్పుడులేని విధంగా విమాన గోపురం నుంచి సూర్య కిరణాలు గర్భ గుడిలోని అమ్మవారి విగ్రహం నుదుటిపై ప్రసరించడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నది.